BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | బుధవారం జులై 01 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆస్ట్రేలియా

**వెస్టిండీస్‌పై 8 వికెట్ల ఘన విజయం.. మూనీ అజేయ అర్ధశతకం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో ఆస్ట్రేలియా వరుసగా మరో ప్రపంచకప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. డియాండ్రా డాటిన్ 26 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆష్లే గార్డ్‌నర్ నాలుగు ఓవర్లలో కేవలం 13 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని కట్టడి చేసింది.126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ప్రారంభంలో రెండు వికెట్లు కోల్పోయినా, బెత్ మూనీ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చింది. మూనీ 61 పరుగులతో అజేయంగా నిలవగా, గార్డ్‌నర్ 35 పరుగులతో నాటౌట్‌గా రాణించింది. ఆస్ట్రేలియా కేవలం 13 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# వ్యవసాయాన్ని పండుగగా మార్చడమే లక్ష్యం

- 30 నెలల్లో వ్యవసాయ రంగానికి రూ.1.75 లక్షల కోట్ల వ్యయం
- రైతుల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రైతు భరోసా పెంపు.. బకాయిల చెల్లింపు
- రైతు భరోసా సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంపు
- గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.7 వేల కోట్ల చెల్లింపు
- ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల రైతు భరోసా నిధుల పంపిణీ
- వ్యవసాయానికి భారీ మద్దతు



**రైతు భరోసా నిధుల విడుదల.. 'వ్యవసాయాన్ని**

**● సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన రైతు భరోసా సదస్సులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను ప్రారంభించారు. తొలి విడతగా 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లను జమ చేయనున్నట్లు ప్రకటించారు. వచ్చే తొమ్మిది రోజుల్లో మొత్తం రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,600 రైతు వేదికల ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "వ్యవసాయాన్ని పండుగగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. గత 30 నెలల్లో వ్యవసాయ రంగంపై

మిగతా 2వ పేజీలో

## గత ప్రభుత్వం మోసం చేసింది

**సీఎం రేవంత్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడిగా చరిత్రలో నిలవాలనేదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రైతు భరోసా సభలో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశాయని ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలో దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన వంటి హామీలు అమలు కాలేదని సీఎం పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కుటుంబ సభ్యులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత పాలకులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ప్రజల వ్యక్తిగత జీవితాల్లోనూ జోక్యం చేసుకున్నారని ఆరోపించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా సీఎం విమర్శలు చేశారు. ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల ఆదాయాన్ని పెంచుతామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. తెలంగాణకు బీజేపీ చేసిన మేలు కేవలం ఇద్దరు కేంద్ర మంత్రుల పదవులు ఇవ్వడమేనని వ్యాఖ్యానించారు.

**ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి సిద్ధం**

బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కేంద్రంలోని బీజేపీ 12 ఏళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వం గత 30 నెలల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించేందుకు కూడా సిద్ధమని తెలిపారు.

అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం

2014లో మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను గత ప్రభుత్వం రూ.8.11 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిందని సీఎం ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం పరిస్థితిని క్రమంగా గాడిలో

మిగతా 2వ పేజీలో

## పరిపాలనా సంస్కరణలపై ప్రధాని మోదీ సమీక్ష

**వ్యాపార సౌలభ్యం, ప్రజా సేవలు, ఆత్మనిర్భర్ భారత్‌పై కార్యదర్శులకు దిశానిర్దేశం**



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సేవా తీర్థ్‌లో నాలుగు గంటలపాటు కీలక సమావేశం నిర్వహించారు. పరిపాలనా సంస్కరణలను వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపరచడం, ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయడం, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల అమలును వేగవంతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ -- ఈజ్ ఆఫ్ లివింగ్' కోసం అనవసర నిబంధనల సరళీకరణ, పరిపాలనా సంస్కరణలు, అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను బలోపేతం చేసే చర్యలపై సమీక్ష నిర్వహించారు.

వివిధ శాఖల కార్యదర్శులు తమ శాఖల్లో అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు తీరు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న చర్యలను ప్రధానికి వివరించారు. వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను కూడా సమర్పించారు.

ఈ సందర్భంగా శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకులను తొలగించి, సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

**పీఎం గతిశక్తి వినియోగంపై దృష్టి**

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం రూపొందించిన పీఎం గతిశక్తి డిజిటల్ ప్లాట్‌ఫారాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అమలుతో కాకుండా, వాటి వల్ల ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పు ఆధారంగా అంచనా వేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారిస్తోందని సమావేశంలో ప్రస్తావించారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ప్రధాని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్, ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి పీకే మిశ్రా, ప్రధాన కార్యదర్శి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌తో పాటు వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని అధ్యక్షతన జరిగిన తొలి పూర్తి స్థాయి కార్యదర్శుల సమావేశం ఇదే కావడం విశేషం.

## యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి ఏర్పాటు

**ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డి చైర్మన్‌గా నియామకం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి 18 మంది సభ్యులతో కూడిన పాలకమండలిని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డిని పాలకమండలి చైర్మన్‌గా నియమించింది. ఈ పాలకమండలి పదవీకాలం రెండేళ్లపాటు కొనసాగనుంది. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఏడుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులతో పాటు పలువురు ప్రముఖులను పాలకమండలిలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వీరిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, మంత్రి కొణిదెల సురేఖతో పాటు ఇతర సభ్యులు కూడా ఉన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కొత్త పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకోనుంది.



## పీఓకేలో ఆందోళనలు ఉధృతి

**22 రోజులుగా నిరసనలు.. భారత్ వైపు సరిహద్దులు తెరుస్తామంటూ హెచ్చరిక**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. రావల్‌కోట్‌లోని ఈద్గా మైదానంలో గత 22 రోజులుగా వేలాది మంది ప్రజలు నిరసన చేపడుతూ, పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదని, ఇస్లామాబాద్ నియంత్రణను ఇకపై అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు.

ఆందోళనలో పాల్గొన్న పౌరహక్కుల కార్యకర్త సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వం ఆహారం, నిత్యావసరాల సరఫరాలను అడ్డుకుంటే భారత్ వైపు సరిహద్దులను తెరుస్తామని, అలాంటి పరిస్థితి వస్తే పీఓకేను తమతోనే ఉండాలని పాకిస్థాన్ ప్రభుత్వమే వేడుకోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

నిరసనకారుల ప్రకారం, పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేత, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పాలనా వైఫల్యాలే ఆందోళనలకు ప్రధాన కారణాలు. గత రెండు వారాలుగా ప్రభుత్వం ఆహారం, నిత్యావసరాల సరఫరాపై దిగ్బంధనం విధించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనల సమాచారం బయటకు వెళ్లకుండా జూన్ 5 నుంచి పీఓకేలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో జూన్ 9 నుంచి మరో నిరసన దీక్ష కొనసాగుతోంది. విదేశాల్లోని పాకిస్థానీ రాయబార కార్యాలయాల వద్ద కూడా కశ్మీరీలు సంఘీభావ నిరసనలు చేపడుతున్నట్లు సమాచారం. ముజఫరాబాద్ సహా తమ ప్రాంతానికి సంబంధించిన రాజకీయ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన విరమించబోమని నిరసనకారులు స్పష్టం చేశారు.

## రేపు రాష్ట్ర కేబినెట్ అత్యవసర భేటీ

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం.. శాఖల అజెండాలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశాలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి అత్యవసరంగా సమావేశం కానుంది. జూలై 2న మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన 34వ కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

కేబినెట్ సమావేశం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా జూలై 2 మధ్యాహ్నం ఒంటి గంటలోపు సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సూచించారు. ఏదైనా శాఖలో అజెండా అంశాలు లేకపోతే 'నిల్' (చీక్మీ్మా) నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు.

సమావేశం సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేబినెట్ సమావేశం ముగిసే వరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, శాఖల కార్యదర్శులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. అలాగే ప్రోటోకాల్, హార్టికల్చర్, ట్రాన్స్‌లేషన్స్ విభాగాలతో పాటు టీజీటీఎస్ యూనిట్ అధికారులు సమావేశానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.



## ఎక్కడైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

**వ్యవసాయంపై ప్రభుత్వ లెక్కల్లోనే పొంతన లేదు.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర రైతాంగం కోసం ఎవరు ఏమి చేశారన్న అంశంపై అసెంబ్లీ సహా ఏ వేదికలోనైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా విస్మరించిందో ఆధారాలతో నిరూపిస్తామని పేర్కొన్నారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతు భరోసా పేరుతో ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని,

మిగతా 2వ పేజీలో

## రైతు భరోసా సభ పేరుతో పీఆర్ స్టంట్లు



**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పేరిట ప్రచార ఆర్భాటం చేస్తోందని, కానీ గత 30 నెలల్లో రైతులకు ఇవ్వాల్సిన దాదాపు రూ.30 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని నిలిపివేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారకరామారావు (కేటీఆర్) ఆరోపించారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన సభపై ఆయన తీవ్ర విమర్శలు చేశారుమంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. "30 నెలల ముదనష్టపు పాలనలో రైతులకు ఇవ్వాల్సిన వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టి, ఇప్పుడు సభల పేరుతో నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గు లేదా?" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రైతు భరోసా నిధుల విడుదలకు కేవలం బటన్ నొక్కితే సరిపోతుందని, దానికి కూడా బహిరంగ సభలు నిర్వహిస్తూ పీఆర్ స్టంట్లు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే నాలుగు విడతల రైతు భరోసా బకాయిలను చెల్లించకుండా రైతులను మోసం చేశారని, ఈ ద్రోహాన్ని అన్నదాతలు ఎప్పటికీ క్షమించరని అన్నారు.

ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చి, చివరకు ఉన్న సాయాన్ని కూడా తగ్గించారని కేటీఆర్ ఆరోపించారు. అరకొరగా కొంతమంది రైతులకు మాత్రమే నిధులు జమ చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రైతు భరోసా సభలు నిర్వహిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేంద్రం ఎంత ధాన్యం కొనుగోలు చేస్తే అంతే కొనుగోలు చేస్తామని చెప్పి ప్రభుత్వం తన బాధ్యత

మిగతా 2వ పేజీలో

## 2028లో బీజేపీ ప్రభుత్వమే లక్ష్యం



**డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తాం.. కాంగ్రెస్‌పై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తమ సంకల్పమని స్పష్టం చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన బూత్ ప్రముఖ్ సమ్మేళన్‌లో ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు.తెలంగాణ ప్రజల పోరాటాలు, బీజేపీ కార్యకర్తల కృషిపైనే పార్టీ బలపడిందని పేర్కొన్న ఆయన, 1984లో తెలంగాణ ప్రాంతం నుంచి బీజేపీకి తొలి ఎంపీని ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో ప్రజలు పెట్టుకున్న ఆశయాలను తిరిగి సాధించేందుకు బీజేపీ కృషి చేస్తుందని చెప్పారు.కార్యకర్తల కృషి, ప్రజల విశ్వాసంతో 2028లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, ప్రతి ఇంటికీ చేరేలా బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన నితిన్ నబీన్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ అమలు కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని పార్టీ నాయకత్వానికి ఏటీఎంలా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ "హామీ ఇచ్చి మరిచిపోయే రాజకీయాలు" చేస్తోందని, కుటుంబ రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా విమర్శలు చేస్తూ ఆయనను "పార్ట్‌టైమ్ రాజకీయ నాయకుడు"గా అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రత, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక విజయాలు సాధించిందని పేర్కొన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్, నక్సలిజం నిర్మూలన చర్యలను ఆయన ప్రస్తావించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పుట్టబోయే బిడ్డకు డీఎన్ఏ పరీక్షలు చేయించాలన్న భర్త..

## గర్భిణి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

పుట్టబోయే బిడ్డకు డీఎన్ఏ పరీక్షలు చేయించాలంటూ భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో ఓ గర్భిణి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన భర్తను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన శ్రావణికి, ప్రవీణ్‌కు గత ఏడాది వివాహం జరిగింది. వివాహం జరిగిన కొద్ది నెలలకే శ్రావణి గర్భం దాల్చింది. అయితే గర్భంలో ఉన్న బిడ్డ తనది కాదంటూ ప్రవీణ్ అనుమానాలు వ్యక్తం చేయడం ప్రారంభించాడు. పుట్టబోయే శిశువుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని భర్త తరచూ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈ విషయంలో అతని తల్లిదండ్రులు కూడా శ్రావణిపై మానసిక ఒత్తిడి తీసుకొచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిరంతర వేధింపులు, అవమానాలు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన శ్రావణి తన నివాసంలో ఆత్మహత్య చేసుకుంది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఫిర్యాదులో భర్త ప్రవీణ్, అతని తల్లిదండ్రులు కలిసి డీఎన్ఏ పరీక్షల పేరుతో తన కుమార్తెను మానసికంగా వేధించారని, తీవ్ర అవమానాలకు గురిచేసి ఆత్మహత్యకు దారితీశారని పేర్కొన్నారు.

దీనిపై పోలీసులు గృహహింస, ఆత్మహత్యకు ప్రేరేపించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన భర్త ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.



# పెండ్లికి నిరాకరించిందని యువతి గొంతుకోసిన యువకుడు

### నిందితుడి కోసం గాలింపు

**బలగం టీవీ, బెంగళూరు**

ప్రేమ వ్యవహారం విషాదాంతానికి దారితీసిన ఘటన కర్ణాటక రాజధాని బెంగళూరులో చోటుచేసుకుంది. ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువకుడు ఆమెను కత్తితో గొంతుకోసి హత్య చేసిన ఘటన మహాలక్ష్మి లేఔట్ ప్రాంతంలో కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. అంజలి (23) అనే యువతి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుండగా, రాజీవ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ గత నాలుగేళ్లుగా సన్నిహితంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల రాజీవ్ పలుమార్లు పెళ్లి చేసుకోవాలని అంజలిని కోరినట్లు తెలుస్తోంది. అయితే అతడికి గతంలో నేర చరిత్ర ఉన్నట్లు అంజలి కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆమె అతనికి దూరంగా ఉండటం ప్రారంభించింది. ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో పాటు సంబంధాలను పూర్తిగా తెంచుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కక్ష పెంచుకున్న రాజీవ్ అంజలిని మాట్లాడుకుందామని కోరాడు. అనంతరం ఇద్దరూ మహాలక్ష్మి లేఔట్‌లోని ఓ ప్రాంతానికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ మరోసారి పెళ్లి విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం తీవ్రరూపం దాల్చడంతో రాజీవ్ కత్తితో అంజలిపై దాడి చేసి ఆమె గొంతును కోసినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన యువతిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న రాజీవ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో మహాలక్ష్మి లేఔట్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రేమ వ్యవహారాలు హింసాత్మక ఘటనలకు దారితీయడం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సరూర్‌నగర్‌లో ఇంట్లో భారీ పేలుడు

### గోడలు దెబ్బతిన్నాయి.. సురక్షితంగా బయటపడ్డ కుటుంబ సభ్యులు

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని బాబూనగర్‌లో ఓ ఇంట్లో సంభవించిన భారీ పేలుడు స్థానికంగా కలకలం రేపింది. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ నివాసంలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడు ధాటికి ఇంటిలోని సామగ్రి ధ్వంసం కావడంతో పాటు గోడలు దెబ్బతిన్నాయి. అయితే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఉన్న మూడు గ్యాస్ సిలిండర్లు సురక్షితంగా ఉండటంతో మరింత పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పేలుడు తీవ్రతకు ఇంటి వంటగది భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రాథమికంగా గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నప్పటికీ, ఖచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడికాలేదు. ఇంట్లో పేలుడు పదార్థాలు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనపై ఫిర్యాదు అందిన అనంతరం పూర్తి స్థాయి విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడం ఊరటనిచ్చింది. ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరిస్తున్నారు.

# కట్టంగూరులో రోడ్డు ప్రమాదం

### టైర్ పేలి లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**

నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో హైదరాబాద్--వరంగల్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముత్యాలమ్మగూడెం సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ పేలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడగా, వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు.

భీమవరం నుంచి హైదరాబాద్‌కు సుమారు 40 మంది ప్రయాణికులతో వస్తున్న ప్రైవేట్ బస్సు ముత్యాలమ్మగూడెం వద్దకు చేరుకోగానే టైర్ పేలినట్లు సమాచారం. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి రోడ్డుమధ్యలోని డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న సిమెంట్ మిక్సర్ లారీని ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్ తమ వాహనాల క్యాబిన్లలో చిక్కుకుపోయారు. స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు కాలు విరిగినట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ స్వల్ప గాయాలతో బయటపడటం ఊరటనిచ్చింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గన్నవరం సమీపంలోని బి.బి.గూడెం వద్ద విజయవాడ వెస్ట్ బైపాస్ జాతీయ రహదారిపై వరుసగా వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన కారు ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీని బలంగా ఢీకొట్టింది. రెండు భారీ వాహనాల మధ్య కారు నుజ్జునుజ్జు కావడంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి, చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి రెండు చేతులు కోల్పోయినట్లు సమాచారం. అతడిని స్థానికులు, పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అదే సమయంలో రహదారిపై వెళ్తున్న ఓ స్కూటర్‌ను అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో స్కూటర్‌దారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ప్రమాద మృతుల సంఖ్య మూడు చేరింది.

సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం క్రేన్ల సహాయంతో దెబ్బతిన్న వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 24 గంటల్లో రాష్ట్రమంతా భారీ వర్షాలు

**తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు**

**జూలై 1 నుంచి 4 వరకు విస్తృతంగా వర్షాలు**

**తెలంగాణతో పాటు 23 రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక**

**జూన్‌లో రాష్ట్రంలో 12 శాతం వర్షపాతం లోటు**

**బలగం టీవీ, హైదరాబాద్**



దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణతో పాటు దేశంలోని 23 రాష్ట్రాల్లో రాబోయే 24 నుంచి 72 గంటల వ్యవధిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. జూలై 1 నుంచి 4 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

వాతావరణ నిపుణుల వివరాల ప్రకారం, రుతుపవనాల చురుకుదలకు కేవలం రుతుపవన ద్రోణి మాత్రమే కాకుండా, బంగాళాఖాతంలో వరుసగా రెండు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడటం కూడా ప్రధాన కారణం. ఈ వ్యవస్థలు మధ్య భారతదేశం వైపు కదులుతూ వాతావరణంలో తేమను పెంచి, రుతుపవనాల ప్రభావాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు.

ఈ ప్రభావంతో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**జూన్‌లో 12 శాతం వర్షపాతం లోటు**

రాష్ట్రంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే 12 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయని వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా 13.03 సెం.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, ఈసారి 11.53 సెం.మీ. మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో 20 నుంచి 59 శాతం వరకు వర్షపాతం లోటు నమోదైంది.

అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 71 శాతం వర్షపాతం లోటు నమోదైంది. అక్కడ సాధారణంగా 142.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 40.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. మరో 12 జిల్లాల్లో సాధారణానికి మించి సుమారు 17 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# వ్యవసాయాన్ని పండుగగా మార్చడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశాం. రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి నిర్ణయం తీసుకుంటున్నాం" అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బకాయిగా ఉన్న రూ.7 వేల కోట్ల రైతు భరోసా నిధులను చెల్లించామని, రైతు భరోసా సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.27 వేల కోట్లకు పైగా జమ చేశామని, తాజా విడతతో కలిపి రైతు భరోసా కింద మొత్తం రూ.36 వేల కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు.

**వ్యవసాయ రంగానికి భారీ మద్దతు**

రైతుల కోసం పంట బోనస్‌గా రూ.4 వేల కోట్లు, వ్యవసాయ పనిముట్ల కోసం రూ.2 వేల కోట్లు, పంట బీమా కోసం రూ.3.5 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం వివరించారు. గత రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్లకే రూ.80 వేల కోట్లకు పైగా చెల్లించామని చెప్పారు.

"గత ప్రభుత్వం పదేళ్లలో వ్యవసాయానికి రూ.1.6 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం కేవలం 30 నెలల్లోనే రూ.1.75 లక్షల కోట్లు వెచ్చించింది. నెలకు సగటున రూ.6 వేల కోట్లు వ్యవసాయంపై ఖర్చు చేస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

**అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన సీఎం, తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, గత ప్రభుత్వం ముగిసే నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు.

**రైతులకు పంట మార్పిడి సూచన**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. "ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకే పంట మార్పిడి చేపట్టాలని రైతులకు సూచిస్తున్నాం. రైతుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నాం" అని అన్నారు.

**70 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

యువత కోసం ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆర్టీసీ బలోపేతం, మహిళా సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పించే చర్యలను కూడా వివరించారు.

చివరగా రైతు భరోసా నిధులు అందుకుంటున్న రాష్ట్ర రైతాంగానికి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, "చెప్పిందే చేస్తాం... చేసేదే చెబుతాం. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

# గత ప్రభుత్వం మోసం చేసింది

(మొదటి పేజీ తరువాయి)

పెడుతోందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి నెల మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

**'పదవుల కోసం కాదు.. మాట కోసం'**

తాను పదవుల కోసం రాజకీయాలు చేయడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన రాజకీయ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను ప్రజల ముందుంచామని గుర్తు చేశారు. అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ నిజాలు చెప్పడానికే ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. "అధికారం శాశ్వతం కాదు.. కానీ మాట నిలబెట్టుకున్న నాయకుడిగా ప్రజలు గుర్తుంచుకోవాలి" అని సీఎం పేర్కొన్నారు.

# రైతు భరోసా సభ పేరుతో పీఆర్ స్టంట్లు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తప్పించుకుందని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో 11 విడతల్లో రూ.73 వేల కోట్ల రైతు బంధు నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని గుర్తుచేసిన కేటీఆర్.. పదేళ్ల పాటు వ్యవసాయాన్ని పండుగలా మార్చిన బీఆర్ఎస్ పాలనకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు.

ఇదిలా ఉండగా, రైతు భరోసా, వ్యవసాయ వ్యయంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో లెక్కలు సరిపోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఆరోపించారు. రైతులకు సంబంధించి ఎవరు ఏమి చేశారన్న అంశంపై అసెంబ్లీలోనైనా, బహిరంగ వేదికపైనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అదేవిధంగా మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రైతు భరోసా బకాయిలను వెంటనే చెల్లించాలని, రైతు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# ఎక్కడైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రైతుల పేరుతో కొత్త నాటకాలు ఆడుతోందని ఆరోపించారు.

ప్రభుత్వంలోని ఇద్దరు కీలక నేతలు ఒకే వేదికపై వ్యవసాయ వ్యయానికి సంబంధించి భిన్నమైన గణాంకాలు వెల్లడించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారని గుర్తుచేశారు. ఇద్దరిలో ఎవరి లెక్కలు సరైనవో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి మొత్తం బడ్జెట్ కేటాయింపులు సుమారు రూ.82 వేల కోట్లు మాత్రమే ఉన్నాయని, అలాంటప్పుడు జూన్ 2026 నాటికే రూ.1.56 లక్షల కోట్లు లేదా రూ.1.75 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేశారో ప్రభుత్వం వివరించాలని ప్రశ్నించారు. బడ్జెట్‌కు మించి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పడం రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. ఇదే విషయాన్ని ఎన్నికల ముందు చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను విశ్వసించేవారా అని ప్రశ్నించారు.ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు, అసత్య ప్రకటనలు మానేసి రైతులకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేకపోతే రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం పంపిణీ

**జూలై కోటాకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సిద్ధం**

**ఈ-పాస్ యంత్రాల ద్వారానే పంపిణీ**

**ఆన్‌లైన్ లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు**


**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా జూలై నెల రేషన్ సరఫరా బుధవారం నుంచి ప్రారంభం కానుందని సివిల్ సప్లయ్స్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. జూలై కోటా కింద రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసేందుకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సిద్ధంగా ఉంచినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

కేంద్ర ఆహార పంపిణీ శాఖ మార్గదర్శకాల మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలల కోటా కింద ఏప్రిల్ 30 నాటికి మొత్తం 6.08 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

రేషన్ పంపిణీ ప్రక్రియలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ లావాదేవీలు, బయోమెట్రిక్ వేలిముద్రల విధానాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి రేషన్ దుకాణంలో ఈ-పాస్ యంత్రాల ద్వారానే బియ్యం పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.





# విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి..



### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని పీ ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదులను ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రారంభించారు. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి.. అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ విద్యాలయంలో అదనపు తరగతి గదులు పూర్తి చేయించామని తెలిపారు. ఈ విద్యాలయంలో బోధన, వసతులపై నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను అడ్మిషన్ చేస్తున్నారని వివరించారు. 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పదో తరగతిలో ఈ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే తాము అనుకున్న లక్ష్యం చేరుకుంటారని పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఇతర రంగాల్లో స్థిరపడిన తర్వాత విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని సూచించారు. విద్యార్థి దశలో మొక్కలు నాటాలని, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని, నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

**పాఠశాల అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్తా..**

పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. పాఠశాల ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందని, ఈ బడిలో సీటు రావడం చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు .తల్లితండ్రులకు కూడా నమ్మకం ఉందని తెలిపారు. అపుడు తమకు ఎంతో మంది ఉపాధ్యాయుల మార్గదర్శనం, సూచనలతో ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డామని పేర్కొన్నారు. వివిధ దేశాలు, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. అందరూ సమానమేనని, ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదివి.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యా శాఖ ను తన వద్ద పెట్టుకొని దేశంలో మోడల్ గా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారని వెల్లడించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. బొప్పాపూర్ స్కూల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. పాఠశాల అభివృద్ధిపై పూర్వ విద్యార్థి గా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించాలి..

### మెనూ చార్జీలు పెంచాలని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు తదితర ధరల పెరుగుదలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థికి రోజుకు రూ.6.50, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు రూ.10 మాత్రమే మెనూ చార్జీ చెల్లిస్తోందని తెలిపారు. అయితే అదే నిధులతో రెండు కూరలు వండి విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ఒక కూరకు కూడా సరిపోని నిధులను మాత్రమే విడుదల చేస్తోందని విమర్శించారు. మార్కెట్‌లో వంటనూనె ప్యాకెట్ ధర సుమారు రూ.190, కందిపప్పు రూ.200, పెసరపప్పు రూ.120, చింతపండు రూ.200, టమాటా రూ.50, మిర్చి రూ.80, ఇతర మసాలా దినుసుల ధరలు భారీగా పెరిగాయని, గ్యాస్ సిలిండర్ ధర రూ.1,100కు చేరిందని పేర్కొన్నారు. కోడిగుడ్డు మార్కెట్‌లో రూ.8కు లభిస్తున్నప్పటికీ ప్రభుత్వం అందుకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బియ్యం తప్ప ఇతర అవసరమైన సరుకులకు తగిన నిధులు అందించకపోవడంతో కార్మికులు అప్పులు చేసి, తమ ఆస్తులు అమ్ముకుని మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. వెంటనే మెనూ చార్జీలను పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 వేతనం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. అలాగే సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా స్కీం వర్కర్లందరినీ రెగ్యులర్ చేసి, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే వచ్చే నెల 10వ తేదీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీల క్యాంపు కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మర్రి విజయ, బి. రెడ్డి లక్ష్మి, జ్యోతి, ఎం.డి. జుబేదా, నర్సవ్వ, రేఖ, మహేశ్వరి, రజిత, లావణ్య, మమత, పోచమ్మ, కొమరవ్వ, సత్తవ్వ, లక్ష్మి, వరలక్ష్మి, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డులపై వేధింపులు ఆపాలి.. అన్యాయ బదిలీలు రద్దు చేయాలి

### : పాడి కౌశిక్ రెడ్డి




**బలగం టీవీ, హుజూరాబాద్**

రాష్ట్రంలో ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను అన్యాయంగా వేధించడం సరికాదని, వారిపై జరుగుతున్న వేధింపులను వెంటనే నిలిపివేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మంది, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 1,100 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న హోంగార్డులను వందల కిలోమీటర్ల దూరాలకు బదిలీ చేయడం వల్ల తీవ్ర ఆర్థిక, కుటుంబ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

హుజూరాబాద్, వేములవాడ, మంథని, సిరిసిల్ల తదితర ప్రాంతాల మధ్య తరచూ బదిలీలు చేయడం వారి జీవనాన్ని మరింత కష్టతరం చేస్తోందని పేర్కొన్నారు. నెలకు సుమారు రూ.30 వేల వేతనం పొందే హోంగార్డులు ప్రతిరోజూ దూర ప్రాంతాలకు ప్రయాణించడం సాధ్యం కాదని, మానవీయ కోణంలో ఆలోచించి ఈ బదిలీలను వెంటనే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

గతంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుల నుంచి అక్రమ వసూళ్లు జరిగినట్లు అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొంతమంది హోంగార్డులను ప్రతిపక్ష నాయకులను కలిశారనే కారణంతో బెదిరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, వారి వ్యక్తిగత వివరాలు సేకరించాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఉదహోంగార్డులను వీలైనంత వరకు వారి సొంత జిల్లాల్లో లేదా కొత్త జిల్లాల పరిధిలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేసి వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డీజీపీని విజ్ఞప్తి చేశారు.



# హుజూరాబాద్ ఉప ఎన్నిక కేసులో బండి సంజయ్‌కు ఊరట..

### కేసు కొట్టివేసిన న్యాయస్థానం

**బలగం టీవి, హైదరాబాద్**

హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

2021 హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచారంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు పంపిణీ చేస్తోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు మాత్రమే అందించి, మిగిలిన మొత్తాన్ని పార్టీ కార్యకర్తలే దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలను ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించిన హుజూరాబాద్ పోలీసులు ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేసి కేసును నాంపల్లి ప్రత్యేక ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేశారు. తాజాగా కేసును విచారించిన ప్రత్యేక కోర్టు, బండి సంజయ్‌పై మోపిన ఆరోపణలను నిర్ధారించే తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో ఈ కేసులో ఆయనకు పూర్తి ఊరట లభించింది.

## గాగిరెడ్డిపల్లిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

**బలగం టీవి, హైదరాబాద్**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు.

గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత, ఉపసర్పంచ్ వడ్లకొండ నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రహదారులను దశలవారీగా సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని గ్రామస్తులకు సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సన్నిల్ల వెంకటేశం, వార్డు సభ్యులు బొమ్మగాని వెంకటేష్, కూన సురేష్, గట్టు మంజుల, అన్నవేని శ్రీనివాస్, చిన్నవేణి మానస, దరవేణి రమ, మౌటం స్వామి, వివిధ రాజకీయ పార్టీల గ్రామశాఖ అధ్యక్షులు నరాల రాజయ్య, కలువల సంపత్ రెడ్డి, మంద ఎల్లయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో అనాధ వృద్దురాలికి అంత్యక్రియలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తంగళ్లపల్లి మండలం ఓబుళపూర్ గ్రామంలోని అమ్మా అనాథ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథ వృద్దురాలు గోగుల లక్ష్మీ భర్త తిమ్మయ్య (65) అనారోగ్యంతో మంగళవారం ఉదయం సహజ మరణం చెందారు. వేములవాడ కు ఎక్కడినుండి వచ్చిందో తెలియదు.. వేములవాడ ప్రాంతంలో పక్షవాతం బారిన పడి, కుడి చేయి మరియు కళ్ల సమస్యతో దయనీయ స్థితిలో రోడ్డుపై ఉండగా వేములవాడ పోలీసులు గుర్తించి సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారుల సూచన మేరకు సుమారు 18 నెలల క్రితం ఓబుళపూర్‌లోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు. అప్పటి నుంచి ఆశ్రమ నిర్వాహకులు ఆయనకు ఆశ్రయం, ఆహారం, వైద్య సేవలు అందిస్తూ సంరక్షించారు.

మంగళవారం రోజు ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి తిమ్మయ్య మృతి చెందారు. ఆయనకు బంధువులు ఎవరూ లేకపోవడంతో తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, జిల్లా సంక్షేమ అధికారి, సిరిసిల్ల ఏరియా ఆసుపత్రి అధికారులు, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శికి సమాచారం అందించారు. అనంతరం అమ్మా అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్, గడ్డం తిరుమల ఆధ్వర్యంలో వృద్ధుడికి అన్ని సంప్రదాయాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గడ్డం కృష్ణవంశీ, గడ్డం దిలీప్ కుమార్, గడ్డం పురుషోత్తం, కనకమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని వృద్ధురాలుకి నివాళులర్పించారు.



## బోయినపల్లి మండల కేంద్రంలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ జన్మదిన వేడుకలు..

**బలగం టీవీ, బోయినపల్లి:**

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ జన్మదిన వేడుకలను బోయినపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుంటి శంకర్ మాట్లాడుతూ సుంకే రవిశంకర్ అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘకాలం జీవిస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, అక్కనపల్లి కరుణాకర్, చిందం రమేష్, బొజ్జ ప్రభాకర్, బీమనాథుని రమేష్, మొత్తం రవీందర్, నల్లగొండ అనిల్ కుమార్, బోయిని రాజు, కన్నం సాగర్, చౌదరి శ్రీధర్, పెగ్గర్ల శేఖర్, దాసరి సుధాకర్, పెగ్గర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## పదవీ విరమణ పొందిన హెచ్ఎం పులి అశోక్‌రెడ్డికి ఘన సన్మానం

**బలగం టీవీ, వీణవంక**

విద్యార్థుల భవిష్యత్తు కోసం జీవితాన్ని అంకితం చేసిన పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు పులి అశోక్‌రెడ్డి సేవలు అభినందనీయమని కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఎన్. ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన పులి అశోక్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభకు ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో ప్రశాంత్‌రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవప్రదమైనదని, పులి అశోక్‌రెడ్డి తన సేవా కాలమంతా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శోభారాణి, సర్పంచ్ సరోజన--రాజేంద్రప్రసాద్, ఉపసర్పంచ్ మహేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ఎమర్జింగ్ ఉమెన్స్ క్రికెట్ లీగ్ లోగో ఆవిష్కరణ.. 16 జట్ల పరిచయం

**బలగం టీవి, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా మహిళా క్రికెట్ ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఎమర్జింగ్ ఉమెన్స్ క్రికెట్ లీగ్ (జుఔజు) లోగో ఆవిష్కరణ కార్యక్రమం జూబ్లీహిల్స్‌లోని ఎంఎంసీసీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లీగ్‌లో పాల్గొనున్న 16 జట్లను నిర్వాహకులు అధికారికంగా పరిచయం చేశారు. కార్యక్రమానికి శ్రీచరణ మీడియా మేనేజింగ్ డైరెక్టర్లు బుస్సా శ్రీనివాస్ గుప్తా, బుస్సా మాధవి గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ లీగ్‌కు అధికారిక ఏజెన్సీ భాగస్వామిగా వ్యవహరిస్తున్న శ్రీచరణ మీడియా, మహిళా క్రికెట్ అభివృద్ధికి జాతీయ స్థాయిలో వేదిక కల్పించే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భాగస్వామ్యం కావడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 2026 ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ లీగ్ దేశంలోని యువ మహిళా క్రికెటర్లకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే అరుదైన అవకాశాన్ని అందించనుందని తెలిపారు. మహిళా క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చే ఈ టోర్నీ భవిష్యత్తులో మరెంతో మంది క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం

## 12న టీజీజీడీఏ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు

**బలగం టీవి, హైదరాబాద్**




తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 12న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ చేపడుతామని, ఈ నెల 4న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించామని వెల్లడించారు.

6న నామినేషన్ల పరిశీలన, 7న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ నెల 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, సాయంత్రం 5 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పదవులకు పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా టీజీజీడీఏ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసి ఉండాలని వివరించారు.

# శశాంక్ సింగ్‌పై కేసు

**వంటమనిషి ఫిర్యాదుతో క్రికెటర్, మాజీ ఐపీఎస్ అధికారి తండ్రిపై కేసు నమోదు**

**బలగం టీవీ, భోపాల్**



పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్‌తో పాటు ఆయన తండ్రి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి శైలేష్ సింగ్‌పై భోపాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో పనిచేస్తున్న వంటమనిషి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాకు చెందిన విపేంద్ర సింగ్ తోమర్ ఇటీవల శశాంక్ సింగ్ నివాసంలో వంటమనిషిగా పనిచేయడం ప్రారంభించాడు. ఉచిత వసతి, భోజనం, నెలకు రూ.15 వేల వేతనంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు సహాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే వంట నాణ్యత విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ శశాంక్ సింగ్, ఆయన తండ్రి, మరో వ్యక్తి తనను దూషించారని, ఉద్యోగం మానేయాలన్న తన నిర్ణయాన్ని అడ్డుకున్నారని విపేంద్ర సింగ్ ఆరోపించాడు. తనపై దాడి చేసి, మొబైల్ ఫోన్‌ను కూడా లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు పంపగా, శరీరం, ముఖంపై గాయాలున్నట్లు ప్రాథమిక వైద్య నివేదికలో నిర్ధారణ అయినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఫిర్యాదు, వైద్య నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు రాతిబాద్ పోలీసులు తెలిపారు.

ఈ కేసులో కుటుంబ డ్రైవర్‌ను కూడా సహ నిందితుడిగా చేర్చినట్లు సమాచారం. నిందితులపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బహిరంగంగా దూషించడం, ఉద్దేశపూర్వకంగా గాయపరచడం, ఉమ్మడి ఉద్దేశంతో దాడికి పాల్పడటం వంటి అభియోగాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన క్రీడా, పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈ ఘటన పట్ల క్రికెటర్ శశాంక్ మాట్లాడుతూ తామేమీ బాధిత వ్యక్తిని బంధీగా ఉంచలేదన్నారు. కుక్ అని చెప్పి ఇంట్లో పనికి వచ్చాడని, కానీ అతనికి ఏమాత్రం వంట చేయడం రాదు అని, ఇంట్లో వీడియోలు, ఫోటోలు తీసేవాడని, తన రూమ్‌లోకి కూడా వెళ్లినట్లు శశాంక్ తెలిపాడు.కేవలం సరదా కోసం అతను పనిలో చేరాడని, కానీ అదృష్టవశాత్తు ఇంట్లో వస్తువుల్ని కోల్పోలేదన్నారు. ఆ వ్యక్తి ఫోన్‌లో ఉన్న ఫోటోలు, వీడియోలను తన తల్లి డిలీట్ చేయించిందన్నా

# ఇంగ్లండ్ సిరీస్‌లో వైభవ్‌పై అందరి చూపు

**టీమిండియా పునరాగమనంపై ఆసక్తి.. అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న సూర్యవంశీ**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐర్లాండ్ పర్యటనలో ఎదురైన వైట్‌వాష్ నిరాశ నుంచి బయటపడాలని భావిస్తున్న టీమిండియా, ఇంగ్లండ్‌తో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. అయితే ఈ సిరీస్‌కు ముందు భారత జట్టులోని బ్యాటింగ్ వైఫల్యాల కంటే యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది.

ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20ల్లో 0–2తో పరాజయం పాలైన భారత జట్టు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఓపెనర్లు సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో జట్టులో మార్పులు అనివార్యమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోషేట్ మాట్లాడుతూ, వైభవ్ సూర్యవంశీ జాతీయ జట్టులో ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని పేర్కొన్నప్పటికీ, ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అతడు కూడా తన అవకాశానికి వేచి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే ఐర్లాండ్ సిరీస్‌లో సంజూ శాంసన్ వరుసగా విఫలమవడం, ఇషాన్ కిషన్ కూడా ఆకట్టుకోలేకపోవడంతో వైభవ్‌కు తుది జట్టులో అవకాశం దక్కే అవకాశాలు పెరిగాయి. తొలి టీ20లో 20 బంతుల్లో 49 పరుగులతో మెరిసిన అభిషేక్ శర్మతో కలిసి వైభవ్‌ను ఓపెనర్‌గా బరిలోకి దింపాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంజూ శాంసన్ ఇటీవల టీ20 ప్రపంచకప్‌లో మంచి ప్రదర్శన కనబర్చడంతో పాటు ఐపీఎల్‌లోనూ రెండు సెంచరీలు నమోదు చేసినప్పటికీ, తాజా వైఫల్యాలు అతనిపై ఒత్తిడిని పెంచాయి. మరోవైపు, ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడరనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, ఇంగ్లండ్ జట్టు జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్, సాకిబ్ మహ్మూద్‌లతో కూడిన బలమైన పేస్ దళంతో పాటు ఆదిల్ రషీద్, రెహాన్ అహ్మద్‌ల స్పిన్ బలంతో బరిలోకి దిగుతోంది. ఈ పరిస్థితుల్లో భారత బ్యాటర్లకు ఇంగ్లండ్ పరిస్థితులు మరోసారి సవాలుగా మారనున్నాయి. ఐర్లాండ్ సిరీస్‌లో సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్‌లకు అరంగేట్ర అవకాశాలు కల్పించిన టీమ్ మేనేజ్‌మెంట్, వైభవ్ సూర్యవంశీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. భారత జట్టు పునరాగమనంతో పాటు వైభవ్ అరంగేట్రం జరుగుతుందా అనే అంశంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# తిలక్ వర్మపై శ్రీకాంత్ విమర్శలు

**జట్టు కోసం కాకుండా వ్యక్తిగత ప్రదర్శనకే ప్రాధాన్యం ఇచ్చాడని వ్యాఖ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో టీమిండియా ఓటమికి తిలక్ వర్మ నెమ్మదైన బ్యాటింగ్ కూడా ఒక కారణమని మాజీ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. జట్టు విజయంపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత ప్రదర్శనకే ప్రాధాన్యం ఇచ్చాడంటూ ఆయన విమర్శించారు. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 0–2 తేడాతో వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ 46 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకం సాధించినప్పటికీ, అతని నెమ్మదైన ఇన్నింగ్స్ జట్టు పరాజయానికి దారితీసిందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన శ్రీకాంత్, తిలక్ వర్మ మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి హీరో కావాలని ప్రయత్నించాడని వ్యాఖ్యానించారు. మిడిల్ ఓవర్లలో దూకుడుగా ఆడాల్సిన సమయంలో సింగిల్స్, డబుల్స్‌కే పరిమితమవడంతో అవసరమైన రన్‌రేట్ పెరిగిందన్నారు. మధ్య ఓవర్లలో భారత బ్యాటర్ల ప్రదర్శన నిరాశపరిచిందని శ్రీకాంత్ తెలిపారు. తిలక్ వర్మతో పాటు శివమ్ దూబే, అక్షర్ పటేల్ కూడా తక్కువ స్ట్రైక్‌రేట్‌తో ఆడారని విమర్శించారు. మిడిల్ ఓవర్లలో దూకుడు లేకపోవడం వల్లే భారత్ మ్యాచ్‌పై పట్టు కోల్పోయిందని పేర్కొన్నారు. మధ్య ఓవర్లలో 45 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా నమోదు కాకపోవడం ఆందోళన కలిగించే విషయమని శ్రీకాంత్ అన్నారు. ఇలాంటి బ్యాటింగ్‌తో టీ20 మ్యాచ్‌లు గెలవడం కష్టమని వ్యాఖ్యానించారు. ఐర్లాండ్ బౌలర్లు భారత బ్యాటింగ్ లైనప్‌ను కట్టడి చేయడం ఆశ్చర్యకరమని పేర్కొన్న ఆయన, స్వింగ్, సీమ్‌కు అనుకూల పరిస్థితుల్లో భారత బ్యాటర్లు మరింత బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉందన్నారు. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లే బదులు మిడిల్ ఓవర్లలోనే దాడికి దిగాల్సిందని సూచించారు. అయితే తిలక్ వర్మపై వచ్చిన విమర్శలపై ఇంకా భారత జట్టు యాజమాన్యం లేదా ఆటగాడు స్పందించలేదు. ఇంగ్లండ్‌తో ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌లో భారత బ్యాటర్లు ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# పిల్లలకు బెదిరింపులు.. 'ఎక్స్'కు గుడ్‌బై చెప్పిన రాహుల్ రవీంద్రన్

**ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆవేదన వ్యక్తం చేసిన దర్శకుడు**


**బలగం టీవీ, హైదరాబాద్**



సోషల్ మీడియాలో పెరుగుతున్న ద్వేషపూరిత వ్యాఖ్యలు, వ్యక్తిగత దాడులపై దర్శకుడు, నటుడు రాహుల్ రవీంద్రన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, చిన్న పిల్లలకు కూడా ప్రాణహాని బెదిరింపులు రావడంతో 'ఎక్స్' (ట్విటర్) వేదికను పూర్తిగా వీడుతున్నట్లు ఆయన ప్రకటించారు.ఇటీవల పూణెలో కేతన్ అగర్వాల్ హత్య ఘటన నేపథ్యంలో సోషల్ మీడియాలో విస్తృత చర్చ సాగుతోంది. ఈ క్రమంలో ఓ నెటిజన్ రాహుల్ రవీంద్రన్‌ను ట్యాగ్ చేస్తూ మహిళల సమస్యలపై సినిమాలు తీసినట్లే పురుషులపై జరుగుతున్న అన్యాయాలపై కూడా సినిమా తీస్తారా? అని ప్రశ్నించారు.దీనికి స్పందించిన రాహుల్ రవీంద్రన్ సమాజంలో ఇప్పటికీ పితృస్వామ్య భావజాలం బలంగా కొనసాగుతోందని అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యల అనంతరం సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, ఆయన కుటుంబ సభ్యులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు.తన చిన్నారులను చంపేస్తామంటూ వచ్చిన బెదిరింపులు తీవ్రంగా కలిచివేశాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో 'ఎక్స్' వేదికను వీడాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. చాలా కాలంగా ఆ సోషల్ మీడియా వేదిక నుంచి దూరంగా వెళ్లాలనే ఆలోచన ఉన్నప్పటికీ, క్రికెట్ మరియు ఇతర క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడం కోసం కొనసాగానని తెలిపారు. బ్రెజిల్–జపాన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న సమయంలో 'ఎక్స్'ను తెరిచానని, అనుకోకుండా నోటిఫికేషన్లు పరిశీలించిన అనంతరం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆయన వివరించారు. అక్కడ కనిపించిన వ్యాఖ్యలు తనలో తీవ్ర ఆవేదన, ఆగ్రహాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు చదివిన తర్వాత తనలో వచ్చిన మార్పు తనకే నచ్చలేదని, ఏ సోషల్ మీడియా వేదికకూ తన మానసిక ప్రశాంతతపై అంత ప్రభావం చూపే అవకాశం ఇవ్వకూడదని భావించినట్లు రాహుల్ రవీంద్రన్ తెలిపారు.

# నేడే ఇంగ్లండ్‌తో భారత్ ఢీ!

**బలగం టీవీ, హైదరాబాద్**





ఇటీవల ఐర్లాండ్ చేతిలో ఎదురైన ఊహించని పరాభవాన్ని మూటగట్టుకున్న టీమిండియా.. మరో అగ్నిపరీక్షకు సిద్ధమైంది. ప్రతిష్టాత్మక ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బుధవారం (జూలై 1) నుంచి ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. నాటింగ్‌హామ్ వేదికగా రాత్రి జరగబోయే తొలి పోరుతో ఈ హై–వోల్టేజ్ సిరీస్‌కు తెరలేవనుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత యువ జట్టు, హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని పటిష్టమైన ఇంగ్లండ్‌ను వారి స్వదేశంలోనే ఢీకొట్టబోతోంది.

**ప్రతికార జ్వాలలో ఇంగ్లండ్.. ఒత్తిడిలో భారత్**

కొద్దిరోజుల క్రితమే ముగిసిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్లో ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా భారత్ చేతిలో ఇంగ్లండ్ 7 పరుగుల స్వల్ప తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఆ మెగా టోర్నీ తర్వాత ఇంగ్లండ్ ఆడుతున్న తొలి అంతర్జాతీయ సిరీస్ ఇదే. దీంతో స్వదేశీ అనుకూలతలను ఉపయోగించుకుని భారత్‌పై ప్రపంచకప్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని బ్రూక్ సేన పట్టుదలగా ఉంది. మరోవైపు, ఐర్లాండ్ సిరీస్‌ను 2–0తో చేజార్చుకుని తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న భారత్.. ఈ సిరీస్ గెలిచి మళ్లీ విజయాల బాట పట్టాలని భావిస్తోంది. తుది జట్టులో వైభవ్ అరోరాకు నిరాశే ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**మ్యాచ్‌ల షెడ్యూల్ (భారత కాలమానం ప్రకారం):**

తొలి మ్యాచ్: జూలై 1 (బుధవారం) -- చెస్టర్–లే–స్ట్రీట్ (రాత్రి 10:00 గంటలకు)

రెండో మ్యాచ్: మాంచెస్టర్, ఓల్డ్ ట్రాఫోర్డ్ (సాయంత్రం 7:00 గంటలకు)

మూడో మ్యాచ్: నాటింగ్‌హామ్, ట్రెంట్ బ్రిడ్జ్ (రాత్రి 10:00 గంటలకు)

నాలుగో మ్యాచ్: బ్రిస్టల్, కౌంటీ గ్రౌండ్ (రాత్రి 10:00 గంటలకు)

ఐదో మ్యాచ్: సౌతాంప్టన్, రోజ్ బౌల్ (సాయంత్రం 7:00 గంటలకు)

**లైవ్ బ్రాడ్‌కాస్ట్ వివరాలు:**

ఈ సిరీస్ ప్రత్యక్ష ప్రసార హక్కులను సోనీ నెట్‌వర్క్, జియోహాట్‌స్టార్ దక్కించుకున్నాయి. టీవీల్లో 'సోనీ స్పోర్ట్స్' ఛానెళ్ల ద్వారా, డిజిటల్‌లో 'జియో హాట్‌స్టార్' ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులు ఈ మ్యాచ్‌లను వీక్షించవచ్చు.

**ఇరు జట్ల వివరాలు:**

భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, శివం దూబే, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

ఇంగ్లండ్ జట్టు: హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, విల్ జాక్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, రెహాన్ అహ్మద్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జేమ్స్ కోల్, జోర్డాన్ కాక్స్, సాకిబ్ మహమూద్, సోనీ బేకర్, జోష్ టంగ, ల్యూక్ వుడ్.

# బ్రెజిల్‌కు జపాన్ గట్టి పోటీ



**ఇంజూరీ టైమ్‌లో మార్టినెల్లీ గోల్‌తో క్వార్టర్ ఫైనల్స్‌కు బ్రెజిల్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్‌కు ఫిఫా ప్రపంచకప్–2026 నాకౌట్ మ్యాచ్‌లో జపాన్ గట్టి సవాల్ విసిరింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఉత్కంఠభరిత పోరులో బ్రెజిల్ 2–1 గోల్స్ తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. చివరి నిమిషం వరకు పోరాడిన జపాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మ్యాచ్ ఆరంభం నుంచే బ్రెజిల్ దాడులకు దిగినప్పటికీ జపాన్ రక్షణ శ్రేణి సమర్థంగా అడ్డుకుంది. మథ్యూస్ కున్హా, బ్రూనో గుమారేస్ ప్రయత్నాలు ఫలించకపోవడంతో బ్రెజిల్‌కు నిరాశ ఎదురైంది. ఆట 29వ నిమిషంలో బ్రెజిల్ డిఫెండర్ డానిలో చేసిన పొరపాటును జపాన్ మిడ్‌ఫీల్డర్ కైషు సానో సద్వినియోగం చేసుకున్నాడు. అద్భుతమైన గ్రౌండ్ షాట్‌తో గోల్ నమోదు చేసి జపాన్‌కు ఆధిక్యం అందించాడు. ఫస్టాఫ్ ముగిసే సమయానికి జపాన్ 1–0తో ముందంజలో నిలిచింది.

సెకండాఫ్‌లో బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోట్టి వ్యూహాలను మార్చారు. వరుస దాడులతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచిన బ్రెజిల్ 56వ నిమిషంలో సమీకరణ గోల్ సాధించింది. గాబ్రియేల్ మగల్హాస్ ఇచ్చిన పాస్‌ను కాసిమిరో హెడర్ ద్వారా గోల్‌గా మలిచి స్కోరును 1–1తో సమం చేశాడు.ఆ తర్వాత వినీషియస్ జూనియర్ చేసిన ప్రయత్నం గోల్‌పోస్ట్‌ను తాకి వెనుదిరగడంతో బ్రెజిల్‌కు మరో అవకాశం చేజారింది. జపాన్ కూడా కట్టుదిట్టమైన రక్షణతో మ్యాచ్‌ను అదనపు సమయానికి తీసుకెళ్లేలా కనిపించింది.

అయితే ఇంజూరీ టైమ్‌లో బ్రెజిల్ విజయగోల్ సాధించింది. 95వ నిమిషంలో బ్రూనో గుమారేస్ ఇచ్చిన పాస్‌ను ప్రత్యామ్నాయ ఆటగాడు గాబ్రియేల్ మార్టినెల్లీ గోల్‌గా మలిచి బ్రెజిల్‌కు విజయాన్ని అందించాడు. దీంతో బ్రెజిల్ శిబిరంలో సంబరాలు వెల్లివిరిశాయి.

ఈ విజయంతో బ్రెజిల్ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించగా, తదుపరి మ్యాచ్‌లో ఐవరీ కోస్ట్ లేదా నార్వేతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో రెండు అసిస్టులతో రాణించిన బ్రూనో గుమారేస్ ప్రపంచకప్‌లో నాలుగు అసిస్టులు నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక అసిస్టులు అందించిన బ్రెజిల్ ఆటగాళ్ల జాబితాలో దిగ్గజం పీలే తర్వాత నిలిచిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

# జర్మనీకి పరాగ్వే షాక్

**పెనాల్టీ షూటౌట్‌లో సంచలన విజయం.. క్వార్టర్స్‌కు పరాగ్వే**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫిఫా ప్రపంచకప్–2026లో మరో సంచలన ఫలితం నమోదైంది. నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్ జర్మనీని పరాగ్వే పెనాల్టీ షుటౌట్‌లో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన ప్రి–క్వార్టర్ ఫైనల్ పోరులో నిర్ణీత సమయం, అదనపు సమయం ముగిసే సరికి ఇరు జట్లు 1–1తో సమంగా నిలవడంతో మ్యాచ్ ఫలితం పెనాల్టీ షుటౌట్‌కు దారితీసింది. షుటౌట్‌లో పరాగ్వే 4–3తో విజయం సాధించి చరిత్ర సృష్టించింది.

మ్యాచ్ ఆరంభం నుంచే పరాగ్వే దూకుడైన ఆటతీరును ప్రదర్శించింది. 42వ నిమిషంలో మథియాస్ గలార్జా అందించిన అద్భుత పాస్‌ను జూలియో ఎన్‌సిసో హెడర్ ద్వారా గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. ప్రపంచకప్ నాకౌట్ దశలో పరాగ్వే సాధించిన తొలి గోల్ ఇదే కావడం విశేషం. తొలి అర్ధభాగంలో జర్మనీ ఆటగాళ్లు ప్రభావం చూపలేకపోయారు.

రెండో అర్ధభాగంలో జర్మనీ పుంజుకుంది. ఫ్లోరియన్ విర్ట్జ్ ఇచ్చిన క్రాస్‌ను కై హావర్ట్జ్ గోల్‌గా మలిచి స్కోరును 1–1తో సమం చేశాడు. అనంతరం జర్మనీ వరుస దాడులతో ఆధిపత్యం చెలాయించినప్పటికీ పరాగ్వే రక్షణ శ్రేణి సమర్థంగా నిలిచింది.

అదనపు సమయంలో జోనాథన్ తాహ్ హెడర్‌తో జర్మనీ గోల్ చేసినప్పటికీ, వీఏఆర్ సమీక్ష అనంతరం రిఫరీ దానిని ఫౌల్‌గా ప్రకటించి రద్దు చేశారు. గోల్‌కీపర్‌ను అడ్డుకున్నట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ తీర్పుపై అభిమానుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

పెనాల్టీ షుటౌట్‌లో పరాగ్వే గోల్‌కీపర్ ఓర్లాండో గిల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. జర్మనీ ఆటగాళ్లు కై హావర్ట్జ్, నిక్ వోల్టెమాడే తీసిన పెనాల్టీలను అడ్డుకొని జట్టుకు కీలక ఆధిక్యం అందించాడు. చివరగా జోనాథన్ తాహ్ పెనాల్టీని చేజార్చగా, జోస్ కనాల్ నిర్ణయాత్మక పెనాల్టీని గోల్‌గా మలిచి పరాగ్వేకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ప్రపంచకప్ చరిత్రలో పెనాల్టీ షుటౌట్‌లో జర్మనీ ఓడిపోవడం ఇదే తొలిసారి. వరుసగా మూడో ప్రపంచకప్‌లోనూ జర్మనీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరకముందే నిష్క్రమించడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన పరాగ్వే తదుపరి మ్యాచ్‌లో ఫ్రాన్స్ లేదా స్వీడన్‌తో తలపడనుంది.

# అల్లరి నరేష్ 'రంభ ఊర్వశి మేనక' విడుదల తేదీ ఖరారు

**పుట్టినరోజు సందర్భంగా టైటిల్, ఫస్ట్‌లుక్ విడుదల..**

**సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ సీనియర్ హీరో అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్రబృందం ప్రత్యేక కానుక అందించింది. నరేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 65వ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో పాటు విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు.

సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. గత కొంతకాలంగా విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, చాలా విరామం తర్వాత మరోసారి పూర్తి స్థాయి కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో రూపొందుతున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం.




'యముడికి మొగుడు' తర్వాత దాదాపు 14 ఏళ్ల విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఫాంటసీ జానర్‌లో నటిస్తుండటంతో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్రానికి 'కామెడీ గోస్ కాస్మిక్' అనే ట్యాగ్‌లైన్‌ను జత చేశారు. విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అల్లరి నరేష్ దేవలోకానికి వెళ్లే మెట్లపై కూర్చుని కనిపించగా, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు ఉన్న శాసనం కనిపిస్తోంది. మేఘాల మధ్య అప్సరసలతో కూడిన దృశ్యాలు చిత్రంలోని ఫాంటసీ అంశాలను ప్రతిబింబిస్తున్నాయి.

ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.